



సీతయ్య నాన్న పోయాడు.

సీతయ్య పసివాడేం కాదు. ముప్ఫయ్యైదేళ్ళ వయసులో నలుగురు పిల్లల్ని కన్న సీతయ్యకి నాన్న పోగానే దుఃఖం ముంచుకొచ్చింది. చంటిపిల్ల వాడిలా భళ్ళుభళ్ళున ఏడ్చాడు. మంచీ, చెడూ చెప్పుకోవటానికి నాన్న లేడనే భావం వచ్చేసరికి ప్రపంచంలో తను ఒంటరి వాడైపోయినట్టనిపించి, గుండెల్లో పెద్ద వెలితి, బతుకులో పెద్ద ఖాళీ..

నాన్న లేడు.

చిన్న వున్న నాన్న ఇవ్వాళ లేడు. పొద్దున్నే స్నానం చేసి, ఉతికిన ధోవతి కట్టుకుని వరండాలో స్తంభాని కానుకుని నిత్యమూ పారాయణ చేసుకునే నాన్న లేడు. తను బయటికెళ్తూ 'బజారు కెళ్ళొస్తా నాన్నా' అని చెప్పటానికి నాన్న లేడు. వరండాలో స్తంభం బోసి పోయి దిగాలుగా వుంది.

ఎప్పటి నాన్న?




చిన్నప్పుడు మూడేళ్ళ వయసులో నాన్న వెల్లకిలా పడుకుని తన్ని గుండెల మీద కూచోపెట్టుకుని, తన చిట్టి చేతులు అందిపుచ్చుకుని 'తారంగం తారంగం తాండవ కృష్ణా తారంగం' అని తన చేత అనిపిస్తూ, తను నాన్న గుండెల మీద చిందులు తొక్కుతుంటే సంబర పడిపోయి మళ్ళీమళ్ళీ గుండెలమీద తొక్కించు కుంటూ ఆనందంతో కావిలించుకుని ముద్దులు పెట్టిన నాన్న మరి లేడు. కొంచెం పెద్దయ్యాక తనతో కృష్ణకి స్నానానికి తీసుకొచ్చి, ఒడ్డునే కూర్చో పెట్టి ఒళ్ళు రుద్ది నీళ్ళు పోసిన నాన్న లేడు. తను ఈత కొడ్తానని పట్టుబడితే నీళ్ళలోకి దింపి నడుము కున్న మొలతాడు చేతపట్టుకుని, తాను తప తప చేతుల్తో నీళ్ళలో బాదుతుంటే ఈతలు నేర్పించిన నాన్న లేడు. ఆ పైన తెప్పకొయ్య మీద నాన్న ఈదు తుంటే ఆ కొయ్య మీద తనూ పడుకుని కృష్ణ మధ్యలోకి వెళ్ళేవాడు. సుడిగుండంలో సుళ్ళలో ఎలా తిరగాలో, జారులో ఎలా బారలు వెయ్యాలో, వడిని ఎలా తప్పుకోవాలో, కృష్ణలో వెలకిలా పడుకుని చేతుల్తో ఎలా ఈదాలో దగ్గరుండి నేర్పినవాడు నాన్న.

తన్ని బళ్ళో వేసినప్పుడు కొత్త చొక్కా, కొత్త లాగూ కుట్టించి, తోటిపిల్లలకి పప్పుబెల్లాలు పెట్టించి, దగ్గరుండి పంతులుకి అప్పచెప్పి, మధ్యాహ్నమయ్యే సరికి భోజనం కూడా చెయ్యకుండా 'పసివాడు ఇంకా రాలేదని' తనకి ఎదురొచ్చి, 'కాళ్ళు కాల్తాయని' భుజం ఎక్కించుకుని ఇంటికి తీసుకొచ్చేవాడు నాన్న. రాత్రిళ్ళు పక్కలో పడుకోబెట్టుకుని బళ్ళో ఏమేం చెప్పారో తన చేత చెప్పించుకుని, పద్యాలు మళ్ళీ మళ్ళీ పాడించుకుని, చిచ్చికొట్టి నిద్రపుచ్చేవాడు. తను ఎదిగాక పొలాలు చూపించి దుక్కి దున్నటం నేర్పి, నాట్లు వేయించి, వ్యవసాయం అప్పగించి 'ఏం పర్వా లేదు. అన్నీ మావాడు చూసుకుంటాడోయ్' అని గర్వంగా ఊరంతా తిరిగి చెప్పుకునేవాడు. పెత్తనం అంతా కొడుక్కి అప్పగించినా సీతయ్య నాన్న ముందు పసివాడే. 'ఇవ్వాళ పొలంలో కలుపు తీస్తాం నాన్నా!', 'ఇవ్వాళ కొబ్బరి పచ్చట్లో కారం ఎక్కువయింది కదూ నాన్నా!' అంటూ ప్రతి చిన్న విషయం నాన్నకి చెప్తూ, 'చాకలి నీలిమందు ఎక్కువ పెడ్తున్నాడు నాన్నా' అంటూ నాన్న పంచె సవరించి పాదా లొత్తుతూ, మెల్లిగా వేళ్ళు లాగుతూ, ఆప్యాయంగా వొళ్ళంతా నిమురుతూ పసిపిల్లవాడిలా నాన్నని అంటు కుపోయేవాడు సీతయ్య. నాన్న అన్నీ వినేవాడు. నవ్వుతూ ఊ కొట్టేవాడు. అలా ఊ కొడ్తుంటే గుండెకు హత్తుకుని ఆశీర్వదిస్తున్నట్లుండేది.

ఇప్పుడెవరు ఊ కొడ్తారు?

ఇప్పుడెవరు తల నిమురుతారు?

చుట్టాలెవరో అంటున్నారు - 'ఆయన కేమండి? దేవుడు. లక్ష్మీదేవిలాంటి కోడల్ని తెచ్చుకున్నాడు. ముగ్గురు మనవల్ని చూశాడు. మనవరాల్ని ఎత్తు కున్నాడు. శ్రీరాముడిలాంటి కొడుక్కి పెత్తనం అప్పగించి నిశ్చింతగా వెళ్ళిపోయాడు మహారాజు!'

ఈ మాటలు సీతయ్యని ఓదార్చలేకపోతున్నాయి. తను నాన్న లేని వాడయ్యాడు. నాన్న కావాలి! సీతయ్య తల్లి దొడ్లో ఏడ్చి ఏడ్చి పడిపోయింది. తెలివి తెచ్చుకుని తులసెమ్మ దగ్గర కెళ్లి "అమ్మా! రోజూ నీకు పచ్చగా పసుపురాసి, నిండుగా కుంకం పెట్టి మొక్కుకునేదాన్నే! నా పసుపు కుంకాలు లాగేసు కున్నావా అమ్మా. పుట్టినప్పటి నించీ నా ముఖం మీద బొట్టు వుండేదే! ఇలా మోడైపోయిన నా బొట్టులేని ముఖాన్ని నేను అద్దంలో చూసుకోలేనే! ఇంక నలు గురుకి ఎలా చూపిస్తాను? అంటూ తులసెమ్మ గట్టు మీద పడిపోయింది.

సీతయ్య పిచ్చి చూపులు చూస్తున్నాడు. నాన్న కోసం ఇల్లంతా వెతుక్కుంటూ వున్నాడు. సీతయ్య నలుగురు పిల్లల్ని ఎవరో సముదాయిస్తున్నారు. సీతయ్యకి నాన్న లేకపోతే ఉన్నట్టుండి వయసొచ్చి పెద్దవాడై ముసలితనం వచ్చినట్లయింది. చుట్టా లెవరో "పోయినవాళ్ళు అదృష్టవంతులు. కానివ్వండి, పనులున్నాయి" అని తొందర పెట్టారు.

నాన్న అంత్యక్రియలు పూర్తిచేసి కృష్ణకి స్నానాని కొచ్చాడు సీతయ్య. అదే కృష్ణ! నాన్న స్నానాలు చేయించిన కృష్ణ! నాన్న ఈతలు కొట్టించిన కృష్ణ! నాన్న మునకలు వేయించిన కృష్ణ! "జన్మంతా నీనీళ్ళు తాగిన నాన్న వెళ్ళిపోయాడమ్మా. నేను నీ నీళ్ళే తాగి బతుకు తున్నానమ్మా! నాకు నాన్న కావాలమ్మా!" అని ఘోరుమన్నాడు సీతయ్య. సీతయ్య శరీరం కృష్ణ, సీతయ్య వూపిరి కృష్ణ, సీతయ్య రక్తం కృష్ణ, సీతయ్య ప్రాణం కృష్ణ, సీతయ్య కన్నీళ్ళు కృష్ణ, కృష్ణ కృష్ణలో కలిసిపోతోంది. కృష్ణ కృష్ణని అడుగుతోంది, నాన్న కావాలని.

కృష్ణ నిండుగా ప్రవహిస్తోంది. సీతయ్య మాటలు వింటూ నిబ్బరంగా సాగిపోతోంది. ఓదార్పుగా సాగి పోతోంది. నిట్టూర్పుగా సాగిపోతోంది. బుజ్జగింపుగా



సాగిపోతోంది. కాలం ఆగదన్నట్లు గబగబా వెళ్ళి పోతోంది.

మహా ప్రవాహం సాగి సాగి వెళ్ళిపోతోంది.

నా... నా... అంటూ సర సర వెళ్ళిపోతోంది.

సీతయ్య "నాన్న! నాన్న" అంటున్నాడు.

కృష్ణ వింటూనే నా... నా... అంటూ పరుగెత్తి పోతోంది.

కొత్త నీళ్ళు "నా... నా..."అంటూ వస్తున్నాయి.

"నా... నా..." అంటూ కిందకి వెళ్ళిపోతు న్నాయి.

మళ్ళీ కొత్త నీళ్ళు "నా...... నా......" మళ్ళీ మళ్ళీ కొత్త నీళ్ళు "నా... నా..."

వచ్చి వెళ్ళిపోతున్న నీళ్ళు సీతయ్య కేదో చెప్తు న్నాయి.

"నాన్న! నాన్నా" అని వినిపించింది. అది సీతయ్య పిలుపు కాదు. సీతయ్య గొంతు కాదు. ఎవరి గొంతు? ఎవరి పిలుపు? సీతయ్య రిక్కించి విన్నాడు. ఆ పిలుపు సీతయ్య కొడుకులది.

"నా... నా..." అంటూ పరుగెత్తుకొచ్చి అంత పొడుగునా కిందికి వెళ్ళి పోతున్న కృష్ణ చెప్పింది. "పిచ్చి నాన్న చిన్న వెళ్ళిపోయాడు. సహజమే, వెళ్ళిపోయిన నాన్న గురించి బెంబేలు పడుతున్నావు. నువ్వు నీ పిల్లలకి నాన్నవని గుర్తు చేసుకో."

కృష్ణ 'నా... నా...' అంటూ రయ్యుమని వచ్చి రయ్యుమని కిందికి వెళ్ళిపోతోంది.